క్లుప్తంగా

నేత్రపర్వంగా పల్లకిసేవ



పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో గల లక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో పల్లకిసేవను వేడుకగా శనివారం నిర్వహించారు. ఉభయకర్తలుగా వెంకటరెడ్డి, విజయభాను దంపతులు వ్యవహరించారు. భక్తులకు ప్రసాదాలను అందజేశారు. భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని సామూహిక విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణాన్ని నిర్వహించారు.

విష్ణాలయంలో పూజలు



మనుబోలు: స్థానిక శ్రీదేవీ, భూదేవీ సమేత విష్ణాలయంలో భీష్మ ఏకాదశ పూజలను వేడుకగా శనివారం నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలను అర్చకుడు మాధవగిరి హనుమాచార్యులు జరిపారు. ఈ సందర్భంగా పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సామూహిక తులసీదళార్చనను నిర్వహించారు. అనంతరం అన్నప్రసాదాన్ని అందజేశారు. ఉభయకర్తలుగా ఆమంచర్ల సుధాకర్ రెడ్డి వ్యవహరించారు.

వైఎస్సార్సీపీలో పలువురికి పదవులు



అబ్దుల్ రహీమ్



అశోక్‌కుమార్‌రెడ్డి

ముత్తుకూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలో పలువురికి పదవులు లభించాయి. పార్టీ మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడిగా ముత్తుకూరుకు చెందిన అబ్దుల్ రహీమ్‌ను నియమించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధనరెడ్డిని కలిసి కృతజ్ఞతలను తెలియజేశారు.

- ఆర్టీఏ విభాగ అధ్యక్షుడిగా దేవారెడ్డి ఆశోక్‌కుమార్‌రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్యానల్ బోర్డులో మంటలు

నెల్లూరు సిటీ : రూరల్ నియోజకవర్గంలోని ఓ భవనానికి విద్యుత్ సరఫరా అయ్యే ప్యానల్ బోర్డులో మంటలు చెలరేగింది. రూరల్‌లోని గాంధీనగర్ నుంచి డైకస్‌రోడ్డుకు వెళ్లే మార్గంలో ఓ ప్రైవేటు భవనం వద్ద పవర్ సరఫరా అయ్యే ప్యానల్ బోర్డు వద్ద శనివారం మంటలు చెలరేగాయి. దీంతో ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ కూడా ఉంది. స్థానికులు వెంటనే విద్యుత్‌ను నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది.

మహాకుంభమేళాకు బయలుదేరిన ఆర్టీసీ బస్సు

నెల్లూరు సిటీ: నగరంలోని ప్రధాన ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సు శనివారం సాయంత్రం 4 గంటలకు మహాకుంభమేళా జరిగే ప్రయాగ్‌రాజ్, కాశీయాత్రకు బయలుదేరింది. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపో–1 మేనేజర్ మురళీకృష్ణ, ఇతర సిబ్బంది జండా ఊపి ప్రారంభించారు.

పెద్దాస్పత్రిలో తనిఖీలు

- తాగునీరు లేకపోవడంపై ఆగ్రహం



మరమ్మతులకు గురైన ఆర్వో ప్లాంట్‌ను పరిశీలిస్తున్న హెచ్‌డీఎస్ కమిటీ సభ్యులు

నెల్లూరు(అర్బన్) : నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో హాస్పిటల్ అభివృద్ధి కమిటీ (హెచ్‌డీఎస్) కో–ఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులు, కమిటీ సభ్యుడు మొగరాల సురేష్ శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంసీహెచ్ బ్లాక్‌లో గతంలో దాతలిచ్చిన ఆర్వో ప్లాంటు మరమ్మతులకు గురైనట్టు తెలుసుకున్నారు. అలాగే వారధి ఫౌండేషన్ సమకూర్చిన ఆర్వో ప్లాంటు గత కొన్ని రోజులుగా పని చేయకపోవడం, శుక్రవారం మరమ్మతులు చేయిస్తే శనివారానికి లీకేజీ కావడంతో సంబంధిత బాధ్యులపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అలాగే ఐపీ బ్లాకులో సైతం ఆర్వో ప్లాంటు మరమ్మతులకు గురైనట్టు తెలుసుకుని తక్షణమే ఆ ప్లాంటును రన్నింగ్‌లో తెచ్చేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ప్లాంట్ నుంచి వివిధ అంతస్తులకు వచ్చే పైపులైన్‌లను పరిశీలించారు. ఆస్పత్రి అధికారులు నిధులను విడుదల చేయడంలో జాప్యం చేయడంతో తమ సొంత నిధులతో ఆర్వో ప్లాంట్‌ను మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్వో ప్లాంటు నిర్వహణ బాధ్యుడు ప్రదీప్, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా బెల్టుషాపులు

- గ్రామాల్లో ప్రశాంతత కరువు
- ఒక్కో బాటిల్‌పై అదనంగా వసూలు
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

వెంకటాచలం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రైవేట్ మద్యం దుకాణాల ఏర్పాటుతో గ్రామాల్లో వీధికో బెల్టుషాపు వెలిసింది. వీటిని దక్కించుకునేందుకు టీడీపీ కార్యకర్తలు పోటీపడటంతో అడిగిన వారి నుంచి నగదును వసూలు చేసి బెల్టుషాపులను మద్యం షాపుల నిర్వాహకులు కేటాయించారు. వీటిపై ఎక్సైజ్, పోలీస్ శాఖల అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామాల్లో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

సర్వేపల్లి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 28 మద్యం దుకాణాలను ఏర్పాటు చేశారు. వెంకటాచలం, పొదలకూరులో ఆరు చొప్పున, ముత్తుకూరులో ఎనిమిది, మనుబోలులో మూడు, తోటపల్లి గూడూరు మండలంలో ఐదు ఏర్పాటయ్యాయి. వీటి పరిధిలో బెల్టు షాపులు తెరిచేందుకు టీడీపీ నేతలు, కార్యకర్తలు ఎగబడ్డారు. దీంతో మద్యం షాపుల నిర్వాహకులు సిండికేట్‌గా ఏర్పడి బెల్టు షాపులకు ఎమ్మార్పీ కంటే రూ.పది అదనంగా అమ్ముతున్నారు. దీంతో బెల్టుషాపుల్లో అదనపు రేట్లకు విక్రయిస్తున్నారు.

అధికారుల చర్యలేవీ..?

కొన్ని గ్రామాల్లో నేతల మధ్య ఉన్న పోరుతో బెల్టు షాపులను పోటాపోటీగా ఏర్పాటు చేశారు. ఇవి ఉండకూడదనే నిబంధన ఉన్నా, ఎక్సైజ్, పోలీస్ శాఖ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదనే విమర్శలున్నాయి. కొన్ని గ్రామాల్లో పగలు, రాత్రనే తేడా లేకుండా మద్యం విక్రయాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. వీటిపై ఎక్సైజ్ అధికారులు, సిబ్బందికి సమాచారమిచ్చినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైన ఉంది.



గొలగమూడి క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పాటైన మద్యం దుకాణం

చర్యలు చేపడతాం

గ్రామాల్లో బెల్టు దుకాణాలపై చర్యలు చేపడతాం. మా దృష్టికి వచ్చిన వెంటనే గ్రామాలకెళ్లి తనిఖీలు నిర్వహిస్తున్నాం. సమాచారమిస్తే దాడులు జరిపి స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేస్తాం.

– ప్రసన్నలక్ష్మి, ఎక్సైజ్ సీఐ



మద్యం సీసాలు

చెత్తకు నిలయం.. పెన్నమ్మ తీరం



జొన్నవాడ కామాక్షితాయి ఆలయం పక్కన నదిలో వేసిన చెత్త

- అధికారుల చర్యలు శూన్యం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయానికి జిల్లా నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు నిత్యం వస్తుంటారు. పక్కనే ఉన్న పవిత్ర పెన్నానదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తుంటారు. అయితే ప్రస్తుతం ఆలయం వద్ద నదిలో స్నానం చేయాలంటే భక్తులు భయపడుతున్నారు. నదిలో ఇష్టారాజ్యంగా చెత్త వేయడంతో అక్కడ మురికి కూపంగా మారింది. ఆలయంలో అన్నదాన కార్యక్రమంలో భాగంగా వచ్చిన విస్తరి ఆకులు, ఆలయంలో శుద్ధి చేసిన తర్వాత వచ్చే చెత్తను నదిలో వేయడం పరిపాటిగా మారింది. దీంతో భక్తులు నదిలో స్నానాలు చేయలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆలయ అధికారులు స్పందించి నదిలో చెత్త వేయకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు.

సమస్యను పరిష్కరిస్తాం

నదిలో చెత్త సమస్యను రెండు మూడు రోజుల్లో పరిష్కరిస్తాం. ఓ ట్రాక్టరును ఏర్పాటు చేసి చెత్తను గ్రామానికి దూరంగా డంపింగ్ యార్డుకు తరలించేలా చర్యలు తీసుకుంటాం.

– అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, ఈఓ, జొన్నవాడ

విజ్ఞాన యాత్రలో విద్యార్థులు



ముత్తుకూరు: విజ్ఞాన, విహార యాత్రలో భాగంగా తిరుపతి సమీపంలోని తలకోన, కల్యాణి డ్యామ్‌ను ముత్తుకూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు శనివారం సందర్శించారు. అదానీ ఫౌండేషన్ సహకారంతో విద్యార్థులు పెద్ద సంఖ్యలో యాత్రలో పాలుపంచుకున్నారు. ప్రకృతి సోయగాలను తిలకించారు. హెచ్‌ఎం చల్లా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాలను తరలిస్తే చర్యలు

కోవూరు : నియోజకవర్గంలో ఎక్కడైనా చికెన్ వ్యర్థాలను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండలంలోని పాటూరు గ్రామంలో ఆమె పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలను శనివారం ఆమె చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా అభివృద్ధికి అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు. పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి, తహసీల్దార్ నిర్మలానంద బాబా, ఎంపీపీ పార్వతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కాకాణికి కృతజ్ఞతలు



వెంకటాచలం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ సర్వేపల్లి నియోజకవర్గ అధ్యక్షుడిగా వెంకటాచలం మండలం కురిచెర్లపాడుకు చెందిన కాటాబత్తిన శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈ క్రమంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ఈ సందర్భంగా కృతజ్ఞతలను తెలియజేశారు. న్యాయవాదులు కాటాబత్తిన శ్రీహర్ష, కోటేశ్వరరావు, నేతలు వల్లమూడి రామకృష్ణయ్య, వెంకటరమణయ్య, కామాక్షయ్య, శ్రీకాంత్, చైతన్య, సాయితేజ, గిరి తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి గంట బహూకరణ



మనుబోలు: భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని మనుబోలులోని అంబేడ్కర్‌నగర్‌లో కొలువైన చెన్నకేశవాలయానికి రూ.ఏడు వేల విలువజేసే గంటను మోచర్ల మల్లికార్జున శనివారం బహూకరించారు. విశేష పూజలను అర్చకుడు సుబ్రమణ్యంశర్మ జరిపారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు.

వేడుకగా చక్రస్నానం



పొదలకూరు: పట్టణంలోని అయ్యప్పనగర్‌లో గల శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా చక్రస్నానాన్ని వేడుకగా నిర్వహించారు. సుప్రభాత సేవ, మేలుకొలుపు, తోమాల సేవ, అన్నదానం తదితరాలను జరిపారు. ఆస్థాన కోలాట గురువు ఆకుల గంగిరెడ్డితో కోలాట ప్రదర్శన, పండరి భజన, పవన్‌దాసు పర్యవేక్షణలో అగ్నిగుండ మహోత్సవాన్ని నిర్వహించారు.

జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ



ముత్తుకూరు: నెల్లూరులో ఈ నెల నాలుగున నిర్వహించిన జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌లో తమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారని ముత్తుకూరులోని వీబీఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఊటుకూరు శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ ఊటుకూరు శైలజారెడ్డి తెలిపారు. ఈ మేరకు వారు మాట్లాడారు. 120కు 104 మార్కులతో హేమంత్, 87 మార్కులతో నేత్రా ప్రథమ, తృతీయ స్థానాల్లో నిలిచారని చెప్పారు. సెపక్‌తక్రా జాతీయ జూనియర్స్ చాంపియన్‌షిప్ డబుల్స్ ఈవెంట్‌లో కాంస్య పతకాన్ని ఆసిఫా సాధించిందని వివరించారు. హెచ్‌ఎం రమేష్, మేనేజర్ శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

10, 11న వేలంపాటలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పలు పనులకు ఈనెల 10, 11వ తేదీల్లో వేలంపాటలు నిర్వహిస్తామని ఆయల ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొబ్బరిచిప్పలు, వస్త్రాలు, పాదరక్షలు, చాపలు, పీటలు సేకరించు హక్కులకు సంబంధించి సోమవారం వేలంపాట ఉంటుందని, ప్రసాదానికి ఫల సరుకులు, అన్నదానానికి ఫలసరుకులు, పుష్పాలు, ప్రింటింగ్, ప్లంబింగ్, పారిశుద్ధ్య సామగ్రి, పూజా సామగ్రి, పాలు, పెరుగు, వంటచెరకు, శేషవస్త్రములకు సంబంధించిన పనులకు మంగళవారం వేలంపాటలు జరుగుతాయని వివరించారు. ఆలయ ఆవరణలోని ఏపీ టూరిజం అతిథిగృహంలో ఉదయం 10 గంటలకు వేలం ప్రారంభిస్తామని, ఆసక్తిగల వారు వేలంపాటలలో పాల్గొనాలని ఈఓ కోరారు.

నిందితుడి అరెస్ట్

పొదలకూరు: మండలంలోని నేదురుమల్లి గ్రామస్తులపై దాడి కేసులో ఒకర్ని పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఎస్సీ కాలనీకి గ్రామానికి చెందిన రవీంద్ర వెళ్లిన సమయంలో శింగయ్య, రమేష్ మరికొందరు దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో రమేష్‌ను అరెస్ట్ చేశారు.

ఆర్థిక సాయం అందజేత

బుచ్చిరెడ్డిపాలెం : బుచ్చి నగర పంచాయతీలో శానిటైజ్ వర్కర్‌గా పనిచేస్తున్న నక్క రమణయ్య అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైస్ చైర్మన్ శివకుమార్‌రెడ్డి పెద్దూరు హరిజనవాడలోని అతని నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. మున్సిపాలిటీ తరఫున రూ.15 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఏఎంసీ చైర్‌పర్సన్ మృతి



పచ్చిపాల విజయలక్ష్మి (ఫైల్)

కోవూరు : కోవూరు మాజీ ఏఎంసీ చైర్‌పర్సన్ పచ్చిపాల విజయలక్ష్మి (70) శనివారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆమె మృతిపట్ల పలువురు సంతాపం తెలియజేశారు. మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాగా ఆమె మృతదేహాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు అత్తిపల్లి అనూప్‌రెడ్డితో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు, నాయకులు నివాళులర్పించారు.

బస్టాండ్‌లో యథేచ్ఛగా ఆటోలు



పొదలకూరు: స్థానిక పంచాయతీ బస్టాండ్‌లో బస్సుల స్థానంలో ఆటోలు దర్శనమిస్తున్నాయి. వీరి ఆగడాలను అడ్డుకునే వారే కరువయ్యారు. పట్టణంలోని పంచాయతీ బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సులు ఆగుతుంటాయి. ఎప్పుడూ రద్దీగా ఉండే ఇక్కడ ఆటోలు హల్‌చల్ చేయడంపై వ్యాపారులతో పాటు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

వామ్మో.. ఇదేమి విద్యుత్ అంతరాయాలు..!

పొదలకూరు: పట్టణంలో మూడు రోజులుగా విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్నాయి. సాధారణంగా సరఫరాను నిలిపేయాల్సి వస్తే అధికారులు ముందే ప్రకటిస్తారు. అయితే అప్రకటిత కోతలతో ప్రజలు నరకయాతనను అనుభవిస్తున్నారు. కాగా సబ్‌స్టేషన్లో సమస్యలు రావడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని సమాచారం. కాగా అకస్మాత్తుగా రిపేర్లు రావడంతో సరఫరా నిలిచిపోయిందని ఏఈ శ్రీకాంత్ తెలిపారు.

ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో భాగస్వాములవ్వాలి



మాట్లాడుతున్న జి.శ్రీనివాస్ మాదిగ

కొడవలూరు : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో చేపట్టే ఉద్యమంలో మాదిగ యువకులతో కుటుంబసభ్యులు భాగస్వాములవ్వాలని ఎంఎస్‌పీ(మహాజన సోషలిస్ట్ పార్టీ) జాతీయ నేత జి.శ్రీనివాస్ మాదిగ పిలుపునిచ్చారు. మండలంలోని కమ్మపాళెం మజరా గుర్రాలదిన్నెలో సమితి మండల స్థాయి సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును వెంటనే అమలు చేయాలన్న డిమాండ్‌తో చేపట్టే ఉద్యమంలో మాదిగలంతా స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. సమావేశంలో సమితి నాయకులు పి.అంబేడ్కర్ మాదిగ, జి.జానకి, కేవీ రమణ, డి.రవి, జె.తిరుపతి, ఎం.కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వంతెనలు



ప్రమాదాలకు నిలయంగా మారిన వరకవిపూడి సమీపంలోని వంతెన

- భయాందోళనలో వాహనదారులు

తోటపల్లిగూడూరు: మండలంలోని పలు ప్రాంతాల్లో ఆర్‌అండ్‌బీ రహదారులపై ఉన్న వంతెనలు శిథిలావస్థకు చేరుకుని వాహనదారులను బెంబేలెత్తిస్తున్నాయి. నరుకూరు నుంచి కోడూరు వరకు, కాకుపల్లి సెంటర్ నుంచి వరకవిపూడి వరకు ఆర్‌అండ్‌బీ రహదారి విస్తరించి ఉంది. ఆయా ప్రాంతాల్లో ఉన్న పలు వంతెనలు ప్రమాదకరంగా మారుతున్నాయి. రహదారులను విస్తరించిన అధికారులు బ్రిడ్జిల విషయంలో మాత్రం శ్రద్ధ చూపలేదు. ఆయా రహదారుల్లో సుమారు 25 వంతెనలున్నాయి. ఇవన్నీ 50 సంవత్సరాల క్రితం నిర్మించినవే. వీటిలో కొన్ని శిథిలావస్థకు చేరుకోగా, మరికొన్ని ఇరుకుగా మారాయి. అలాగే అధికశాతం వాటికి రక్షణ గోడలు లేవు. ఈ క్రమంలో వాహనదారుడు ఏ మాత్రం అదుపుతప్పినా గోతిలో పడాల్సిందే. అలాగే ఇరుకుగా మారిన వంతెనల వద్ద ఒక వాహనం ప్రయాణం సాగిస్తుంటే మరొకటి ఆగాల్సిందే. అలా కాకుండా ఎదురొస్తే ప్రాణాల మీదకు తెచ్చుకొన్నట్లే. అంతే కాకుండా శిథిలావస్థకు చేరుకున్న పలు రహదారుల్లో వాహనదారులు భయం గుప్పెట ప్రయాణం సాగించాల్సి వస్తోంది. కాలం చెల్లిన ఈ వంతెనలతో ఏ క్షణాన ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని హడలిపోతున్నారు. వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే కోడూరు, తోటపల్లిగూడూరు మార్గాల్లో బ్రిడ్జిల పరిస్థితి మరీ దారుణంగా మారిపోయింది. ఈ క్రమంలో పలుచోట్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన మల్లికార్జునపురం సమీపంలో ఉన్న బ్రిడ్జి